క్లుప్తంగా

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు


సత్యనారాయణ, ఎంఈఓ

నల్లజర్ల: ఈనెల 24 నుంచి జూన్ 3 వరకూ నిర్వహించే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు ఎంఈఓ-1 వై. సత్యనారాయణ తెలిపారు. మండలం నుంచి దాదాపు 600 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. ఇందుకోసం నల్లజర్ల జెడ్పీ హైస్కూల్, శశి స్కూలు, సెయింట్ క్లారెట్స్ స్కూళ్లను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్, నెట్ సెంటర్లను మూసివేయాలని ఎంఈఓ ఆదేశించారు. పరీక్షల వేళల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరామన్నారు. శశి స్కూల్‌కు చీఫ్ సూపరింటెండెంటుగా ప్రకాశరావుపాలెం హెచ్‌ఎం జయశంకర్, సెయింట్ క్లారెట్స్ స్కూల్ సెంటర్‌కు పుల్లలపాడు హెచ్‌ఎం ఎస్.భారతి, టి.మురళీకృష్ణ, నల్లజర్ల హైస్కూల్‌కు ఆ స్కూల్ హెచ్‌ఎం కోమలీ చిత్ర, వేణులు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా నియమితులయ్యారు. కస్టోడియన్-1గా కోమలీచిత్ర, కస్టోడియన్-2గా గోపి గోవర్ధన్ వ్యవహరిస్తారన్నారు.

ఇటలీ యూనివర్సిటీ నుంచి గంగాహారికకు గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ అందుకుంటున్న గంగాహారిక

నల్లజర్ల: మండలంలో అనంతపల్లికి చెందిన గంగాహారిక తెలుగు వారు గర్వపడేలా ఇటలీలోని మిలాన్ యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించింది. ఆమె ఈ యూనివర్సిటీలో రెండేళ్ల ఫ్యాషన్ టెక్నాలజీ, బిజినెస్ మేనేజ్‌మెంటు డబుల్ ఎంబీఏ కోర్సులు పూర్తి చేసింది. 176 మంది విద్యార్థులున్న ఈ బ్యాచ్‌లో ఆమెకు మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు బంగారు పతకం లభించింది. ఇంజినీరింగ్‌లో ఈసీఈ పూర్తి చేసి రెండేళ్లపాటు యాక్సెంచర్ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోంగా ఉద్యోగం చేసిన గంగాహారిక ఇటలీ వెళ్లడానికి ముందు ఆ దేశంలో మాట్లాడే పర్షియన్, ఇటాలియన్ భాషలతో పాటు ఇంగ్లిషు, హిందీ నేర్చుకుంది. కాగా వైఎస్సార్ సీపీ నాయకుడు బళ్ల ప్రభాకరరావు (నాని), కనకదుర్గల కుమార్తె.

మెరిట్ విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం


విద్యార్థిని వైష్ణవికి చెక్కు అందిస్తున్న మాజీ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు

నిడదవోలు: మెరిట్ విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందించారు. పట్టణానికి చెందిన తుట్టగుంట వైష్ణవి ఈ ఏడాది వెలువడిన పదో తరగతి పరీక్షల్లో 593 మార్కులు సాధించింది. ఆమెను ప్రోత్సహించేందుకు కాకినాడకు చెందిన ఆదిత్య డెవలపర్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆమెకు గురువారం రూ.10,000 చెక్కు అందజేశారు. ఈ చెక్కును మాజీ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. బళ్ళా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

చాగల్లు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో చాగల్లు మెయిన్ రోడ్ లోని కాకతీయ కల్యాణ మండపం సెంటర్ వద్ద వేసవి ప్రారంభం నుంచీ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. 51వ రోజైన గురువారం ఆతుకూరి నరసింహమూర్తి జ్ఞాపకార్థం వారి అల్లుడు కరుటూరి బాలకృష్ణ, పద్మావతి, కుటుంబ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


మహిళ మృతదేహం

చాగల్లు: నిడదవోలు - చాగల్లు రైల్వే స్టేషన్ల మధ్య దారవరం రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని కనుగొన్నట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్సై జి.శ్రీహరిబాబు గురువారం తెలిపారు. మృతురాలి వయసు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఆమె తెలుపు రంగు మీద నీలం రంగు డైమండ్ చుక్కల చీర, పింక్ కలర్ జాకెట్, పసుపు రంగు లంగా ధరించినట్టు తెలిపారు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్టు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 94906 17090, 70133 60296 అనే నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

బుద్ధుని బోధనలు ప్రపంచానికి మార్గదర్శకం

- బౌద్ధ పీఠాధిపతి బంతె అనాలియో
- ధమ్మపీఠంలో బుద్ధ పూర్ణిమ వేడుకలు
- పాలిసెట్, టెన్త్ మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు
- ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలకు సత్కారం


ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మపీఠంలో ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: బుద్ధుని బోధనలు కాలాతీతంగా ప్రపంచానికి మార్గదర్శకాలని బౌద్ధ పీఠాధిపతి బంతె అనాలియో అన్నారు. ఉండ్రాజవరంలోని బౌద్ధ ధమ్మపీఠంలో గురువారం బుద్ధ పూర్ణిమ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి ప్రేమను, కరుణను, అహింసను తొలిసారిగా అందించిన వ్యక్తి బుద్ధుడన్నారు. కాగా టెన్త్ పాసైన విద్యార్థులకు ధమ్మపీఠంలో ఏపీ పాలిసెట్‌లో ఉచిత కోచింగ్ ఇచ్చారు. అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు బుద్ధ పూర్ణిమ వేడుకల్లో ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. వారికి కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే యూటీఎఫ్ మండల శాఖ తరఫున ఎస్ఎస్‌సీలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అంతేగాకుండా మండలంలోని ఎనిమిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించి, ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు బుద్ధుని విగ్రహాన్ని దర్శించుకుని, బౌద్ధ భిక్షువు అనాలియో ఆశీర్వచనాలు పొందారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోమటిపల్లి వెంకట సుబ్బారావు, చిట్టూరి రీనా, మల్లిన శ్రీను, మల్లిన సత్యనారాయణ, బూరుగుపల్లి కళారావు, గంటా వెంకట్రావు, తిరుపతి, సర్పంచ్ కరుటూరి నరేంద్ర, రమేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద..


తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుద్ధుడి చిత్ర పటానికి నివాళి

తాళ్లపూడి: వైశాఖ బుద్ధ పూర్ణిమను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా బుద్ధుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బుద్ధుడు మళ్లీ పుడితే దేశం మరింత బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలోనే మొట్టమొదటి సామాజిక విప్లవకారుడు బుద్ధుడే అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సీతారామరాజు, వీఆర్వో సంజీవరావు, వీఆర్ఏలు శ్రీలక్ష్మి, రమణమ్మ, భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకుడు సుధీర్ పాల్గొన్నారు.

సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు


తాళ్లపూడిలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

తాళ్లపూడి: స్థానిక పుష్కర్ ఘాట్ సమీపంలోని గంగా పార్వతీ సమేత గౌతమేశ్వర స్వామి, రమా సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, వైశాఖ పూర్ణిమ వేడుకలు నిర్వహించారు. 100 మంది దంపతులు ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. నిర్వహించారు. పవిత్ర వైశాఖ మాసంలో అన్నవరం సత్యదేవుని కల్యాణం, వ్రతం ఆచరిస్తే శుభ ఫలితాన్ని ఇస్తుందని టీటీడీ ధర్మ ప్రచారకుడు పరస రాధాకృష్ణ ఈ సందర్భంగా అన్నారు. అనంతరం దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.అధిక సంఖ్య లోమహిళలు పాల్గొన్నారు. వ్రతాల్లో పాల్గొనే వారికి అవసరమైన పూజ సామగ్రి మొత్తం రేకపల్లి వీరాస్వామి (మాస్టారు)దంపతులు కానుకగా అందజేశారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

గోపాలపురం: దేవరపల్లి మండలం యాదవోలు గ్రామంలో 20 లీటర్ల సారా తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్టు దేవరపల్లి ఎస్ఈబీ సీఐ కేవీ స్వామి చెప్పారు. అతడి వద్ద నుంచి పోలీసులు సారాను స్వాధీనం చేసుకున్నారు.

రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు హెచ్చరించారు. పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు గురువారం సాయంత్రం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురి కంటే ఎక్కువ మంది ఒకచోట గుమికూడరాదన్నారు. జూన్ 4, 5,6 తేదీల్లో విజయోత్సవాలు, ర్యాలీలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. బహిరంగ సమావేశాలకు అనుమతి లేదన్నారు. ఉద్దేశ పూర్వకంగా ప్రత్యర్థి పార్టీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో వదంతులు సృష్టించడం నేరమని సీఐ స్పష్టం చేశారు. అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. హింసాత్మక చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని రౌడీషీటర్లకు ఆయన సూచించారు.

ముగిసిన స్వామివారి కల్యాణోత్సవాలు

- చివరి రోజు వేంకటేశ్వరుని సేవకు 25 వేల మంది భక్తులు
- దర్శనానికి మూడు గంటల సమయం
- పూర్ణాహుతితో అన్నవరప్పాడులో ముగిసిన ఉత్సవాలు


స్వామి వారి చక్ర స్నానానికి కోనేరులో దిగుతున్న పండితులు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం వైశాఖ పౌర్ణమి కావడంతో వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనానికి భక్తులకు సుమారు మూడు గంటల సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా వైఎస్సార్ సీపీ నాయకుడు పంతం చిన్న యాత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో పిల్లలకు పాలు, సత్యనారాయణస్వామి వారి ప్రసాదం, బూందీ ప్రసాదంగా పంపిణీ చేశారు. వందలాది మంది భక్తులు తల నీలాలు సమర్పించారు. ఉదయం, సాయంత్రం కలిపి సుమారు 15 వేల మంది భక్తులకు ఆలయం వద్ద అన్నసమారాధన చేశారు. గురువారం ఒక్కరోజే సుమారు 25 వేల మంది భక్తులు స్వామి వారి దర్శనం చేసుకున్నారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

కన్నుల పండువగా చక్రస్నానం

స్వామి వారి చక్ర స్నానాన్ని వేలాది మంది భక్తుల సమక్షంలో కోనేరులో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 'నమో వెంకటేశాయ' అనే వందలాది భక్తుల స్తోత్రంతో కోనేరు ప్రాంతం మారుమోగింది. స్వామివారి కల్యాణ మహోత్సవాల చివరి రోజు నిర్వహించిన సంకల్పం, మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి సందడిగా సాగాయి. అన్నవరప్పాడు సర్పంచ్ పంత బాల సుందరి, సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా హోమం నిర్వహించారు.


హోమంలో ద్రవ్యాలు వేస్తున్న అన్నవరప్పాడు సర్పంచ్ పంతం బాలసుందరి


విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి,అమ్మవార్లు

ఫలితాలు వచ్చే వరకూ కార్డన్ అండ్ సెర్చ్


పెద్దగూడెంలో యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై సతీష్‌కుమార్

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ కొనసాగుతుందని స్థానిక ఎస్సై కర్రి సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దగూడెం గ్రామంలో గురువారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఈ గ్రామంలో రికార్డులు లేని వాహనాలను గుర్తించి, సీజ్ చేశారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని ఈ సందర్భంగా ఆయన ఆ గ్రామ యువతకు సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా పోలీసు కేసులు నమోదైతే, యువత జీవితాలు నాశనం అవుతాయని ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. అక్రమ మద్యం, సారా తయారీ, అమ్మకాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

గోపాలపురం మండలం జగన్నాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్ కొనసాగుతోందని ఎస్సై సతీష్‌కుమార్ చెప్పారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య ఇటీవల ఈ గ్రామంలో గొడవలు తలెత్తిన నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మహనీయుల జీవితాలపై అవగాహన


నిడదవోలు గ్రంథాలయంలో మహనీయుల చరిత్రలు చదువుతున్న విద్యార్థులు

నిడదవోలు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు మహనీయుల జీవిత చరిత్రపై అవగాహన కల్పించారు. భారత స్వాతంత్ర్య సమయోధులైన బాలగంగాధర్ తిలక్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సరోజినీనాయుడు వంటి వారి జీవిత చరిత్రలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కుంచే చిన బాబు, సీహెచ్ జగదీష్, ప్రభాకర్, వేదుల జనార్దన రావు, శంభరం తదితరులు పాల్గొన్నారు.

సంగీతంతో మానసిక ఆనందం


ముక్కామల శాఖా గ్రంథాలయంలో ..

పెరవలి: సంగీతం..మనసుకు, మనిషికి సంబంధించినదని, సంగీతాన్ని మనసుతో వింటే ఏకాగ్రత పెరుగుతుందని సంగీత మాస్టారు రాజోలు శ్రీనివాస్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ముక్కామల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సంగీతంపై ఆయన ప్రాథమిక అవగాహన కల్పించారు. సంగీతం ఏకాగ్రతతో సంగీతాన్ని వింటే చలనం వచ్చి మనకు తెలియకుండానే కాళ్లు, చేతులు ఆడిస్తామన్నారు. కార్యక్రమంలో కరుటూరి విశ్వనాథం, కోపెల్లి పట్టాభిరామం, కె. భవాని, మధులీల, లైబ్రేరియన్ యు.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చంద్రవరంలో..

చాగల్లు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు చంద్రవరం గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం విద్యార్థులతో నీతి కథలు చదివించారు. ఎంపీ యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్ .రమాంబ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు వేమన పద్యాలు, సుమతి శతకాలు, ఎక్కాలు నేర్పించారు. అనంతరం పుస్తక సమీక్ష జరిపారు. కార్యక్రమంలో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూన్ 7 వరకూ ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతాయని గ్రంథపాలకుడు సుమన్ కుమార్ తెలిపారు

ఘనంగా మహాలక్ష్మమ్మ ఉత్సవాలు


వేగేశ్వరపురంలో అమ్మవారి సిరి బొమ్మ, గరగ నృత్యం

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామ దేవత మరిడి మహాలక్ష్మమ్మ వారి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని మొక్కుతూ ఏటా మే నెలలో వచ్చే పౌర్ణమి నాడు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి సిరిబొమ్మను గరగ నృత్యాలతో గ్రామంలో ఊరేగించారు. ఇందుకోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు ఉదయం నుంచీ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. హరే శ్రీనివాస కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం సందడిగా సాగింది. అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు శిరిబొమ్మ ఉత్సవంలో పాల్గొన్నారు. పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రంగు చూసి నోరూరిందా.. ఆరోగ్యం హరీ!

నల్లజర్ల: ఫల రాజమైన మామిడికి ఉన్న డిమాండ్ మరే పండుకూ ఉండదేమో. వేసవి వచ్చిందంటే చాలు నల్లజర్ల జంక్షన్‌లోనే కాదు, రహదారి మార్జిన్లలోనూ మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతాయి. ఈ ఏడాది పరిసర ప్రాంతాల్లో మామిడి పంట తక్కువగా ఉండడంతో ఇక్కడ విక్రయిస్తున్న మామిడి పండ్లకు డిమాండ్ పెరిగింది. డిమాండ్ మేరకు విక్రయించేందుకు వ్యాపారులు తక్కువ సమయంలోనే పచ్చి మామిడిని పక్వానికి తేవడానికి ఆరోగ్యానికి హానికరమైన కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. గతంలో ఇలాంటి కృత్రిమ పద్ధతుల ద్వారా కాకుండా ఓ గదిలో ఎండుగడ్డి వేసి మామిడికాయలను మాగ బెట్టేవారు. ఈ పద్ధతిలో మామిడి కాయలు పక్వానికి రావడానికి వారం రోజులు పట్టేది. ప్రకృతి సిద్ధంగా పండిన మామిడి రుచిగా ఉంటుంది. ఆరోగ్యానికి ఎలాంటి హానీ చేయదు. అయితే తక్కువ సమయంలో మామిడి పండ్లను విక్రయానికి సిద్ధం చేసేందుకు ఇటీవల కార్బైడ్ వినియోగం ఎక్కువైంది. కార్బైడ్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించినా చాటుగా ఇంకా అక్కడక్కడా వినియోగిస్తూనే ఉన్నారు. దీనివల్ల మామిడి పండు పసుపు పచ్చగా మారి చూడగానే తినాలని నోరూరిస్తుంది. తీరా ఇంటికి వెళ్లి కోసి చూస్తే లోపలంతా పచ్చి. రుచీ పచీ ఉండదు. అంతేగాకుండా కార్బైడు వినియోగించిన మామిడి పండ్లను తినడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనిపై నల్లజర్ల ఉద్యాన శాఖాధికారి బబితను 'సాక్షి' వివరణ కోరగా కార్బైడ్ వినియోగం ప్రాణాంతకం అన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై ఆహార కల్తీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్బైడ్ వినియోగం వల్ల ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అధిక మొత్తంలో మామిడి పండ్లను మాగబెట్టుకునే వారు ఉద్యాన యూనివర్సిటీలో లైట్నింగ్ చాంబర్‌లో రసాయనాలు వాడకుండా నామ మాత్రపు ఫీజుతో సహజ సిద్ధంగా మగ్గ బెట్టే ఏర్పాట్లు ఉన్నాయన్నారు.


మార్కెట్‌లో విక్రయిస్తున్న మామిడి పండ్లు